సాక్షి కరీంనగర్

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నవరస్ స్ట్రీట్, శ్రీలత హాస్పిటల్, మెడికవర్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



క్వింటాల్ పత్తి రూ.7,000

జమ్మికుంట: స్థానిక మార్కెట్‌లో క్వింటాల్ పత్తి రూ.7,000 పలికింది. మార్కెట్‌కు 86 వాహనాల్లో 666 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. మార్కెట్ చైర్‌పర్సన్ స్వప్న, కార్యదర్శులు పర్యవేక్షించారు.



వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో రోడ్డు ఆక్రమణలపై నగరపాలకసంస్థ మరోసారి దృష్టి సారించింది. 'రోడ్లపైనే దందా' పేరిట 'సాక్షి'లో గురువారం వచ్చిన కథనానికి బల్దియా స్పందించింది. ఆదర్శనగర్ వద్ద మంచిర్యాల మెయిన్‌రోడ్డుపై ఆక్రమణలను గురువారం డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించారు.ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల రోడ్డులోనూ ఆక్రమణ తొలగింపు చేపట్టారు. నగరవ్యాప్తంగా ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణల తొలగింపును కొనసాగిస్తామని ఏసీపీ వేణు తెలిపారు. ఆక్రమణలను తొలగించడం నిరంతర ప్రక్రియ అని, రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ సంధ్య, డీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నాం



ప్రొసీడింగ్ అందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాటను, ప్రభుత్వంలోకి వచ్చాక కాంగ్రెస్ నిలబెట్టుకుందని సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని రేకుర్తి బుడగజంగాల కాలనీలో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామంటూ మాయమాటలు చెప్పి, ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లు ఆలస్యమైనందున, లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతుందన్నారు. మిగిలిన అర్హులందరికి కూడా ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. నాయకులు అస్తపురం రమేశ్, పర్వతం మల్లేశం, అస్తపురం తిరుమల, మ్యాక శ్రీనివాస్, దుబ్బుల రాజయ్య,లచ్చయ్య పాల్గొన్నారు.

బలమున్న చోట బరిలో దిగుతాం



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

శంకరపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమున్న చోట పోటీలో ఉంటామని, దేశవ్యాప్తంగా కేంద్రమే కులగణన చేస్తే చిక్కులు ఉండేవి కావని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కేశవపట్నంలో మాట్లాడారు. కేంద్రం కులగణన చేపట్టకపోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించి, స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లిందన్నారు. బలమున్న చోట సీపీఐ తరఫున ఎన్నికల్లో పోటీలో ఉంటామని, టీపీసీసీ అధ్యక్షుడితో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, మండల కార్యదర్శి పిట్టల స మ్మయ్య, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్, రవి, కల్యాణ్, రామ్‌గోపాల్, రత్నాకర్, రమారావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా నాణ్యమైన విద్యుత్

- కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ మేక రమేశ్‌బాబు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ లైన్లు (ఇంటర్ లింకింగ్ వ్యవస్థ) ఏర్పాటు చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ మేక రమేశ్‌బాబు తెలిపారు. 33కేవీ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థకు, 33/11 కె.వీ. సబ్ స్టేషన్ నుంచి మరో 132/33 కె.వీ సబ్‌స్టేషన్‌కు, 33 కేవీ లైన్ నుంచి మరొక 33 కె.వీ.లైన్‌కు మధ్య అనుసంధానంగా ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందచేయడం. ప్రకృతి వైపరీత్యాల సమయం, మెయింటెనెన్స్ సమయంలో ఇతర కారణాల చేత ఒక లైన్‌లో లేదా సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన/నిలుపవలసిన సమయంలో ఆయా లైను లేదా సబ్ స్టేషన్ పరిధిలో గల 33/11 కె.వీ.ఇంటర్ లింక్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అందించడమని వివరించారు. దీంతో విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు జరగకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు వీలు కలుగుతుందని అన్నారు.

ఉత్సాహం.. నైరాశ్యం

- పొద్దున నామినేషన్ల సందడి
- సాయంత్రం కోర్టు స్టేతో నిరాశ
- స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్
- గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం
- ఆరు వారాల తరువాతే ఎలక్షన్లపై స్పష్టత

పొలిటికల్ సీన్



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

స్థానిక సంస్థల ఎన్నికలకు గురువారం ఉదయం నామినేషన్ల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లాలోని పలు పల్లెల్లో సందడి నెలకొంది. అక్కడక్కడ కొందరు ఆశావహులు మద్దతుదారులతో వెళ్లి నామినేషన్లు వేశారు. కాగా.. బీసీ రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడంతో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. రెండేళ్లుగా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలవాలనుకున్న వారి ఆశలపై సాయంత్రానికి నీళ్లు చల్లినట్లయ్యింది. కొద్దిరోజులుగా అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బందికి శిక్షణ, రిజర్వేషన్ల ప్రకటన, ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా ఎన్నికలు ఉంటాయని భావించిన వారికి కోర్టు స్టేతో ఊరించి ఉసురుమనిపించిన ట్లయ్యింది. ఆరు వారాల తరువాత కోర్టు విచారణ చేపట్టనుండటంతో, అప్పుడే ఎన్నికలు జరిగే అవకాశముంది. దీంతో గ్రామాల్లో నిన్నటి వరకు సందడి నెలకొనగా.. ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం ఏర్పడింది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరు ఎంపీటీసీ, మూడు జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 311 ఎంపీటీసీలు, 30 జెడ్పీటీసీ స్థానాలకు తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆయా జిల్లాల కలెక్టర్లు విడుదల చేశారు. రిజర్వేషన్ల కేసు కోర్టులో ఉన్న నేపథ్యంలో నామినేషన్ దాఖలు చేసేందుకు ఆశావహులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా కథలాపూర్ ఎంపీటీసీ స్థానానికి కారపు గంగాధర్, ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి ఎంపీటీసీకి నాంపెల్లి వెంకటాద్రి నామినేషన్ వేశారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం జల్లారం ఎంపీటీసీకి ఓదెలు, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్, బోయినపల్లి మండలాల జెడ్పీటీసీలకు ఎడపల్లి అనిల్, గురజాల శ్రీధర్ నామినేషన్ వేశారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ఎంపీటీసీ స్థానానికి చిలుక ప్రభాకర్ నామినేషన్ వేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్, మెట్‌పల్లి ఎంపీటీసీలకు రెడ్డి కుమార్, గొట్టె మధు, వి.సైదాపూర్ జెడ్పీటీసీ స్థానాలకు అరుణ లంకదాసరి కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్లు వేశారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలకు ఆరు, జెడ్పీటీసీ స్థానాలకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి.



వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ఎంపీటీసీకి నామినేషన్ వేస్తున్న చిలుక ప్రభాకర్

రిజర్వేషన్లు మారేనా?

ప్రస్తుతం ప్రభుత్వం బీసీలకు 23శాతం ఉన్న రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో జారీచేసి, దాని అనుగుణంగా సీట్లు ప్రకటించింది. తాజాగా కోర్టు తీర్పు నేపథ్యంలో గతంలో బీసీలకు ఉన్న 23శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వ హిస్తే, 19శాతం మేర బీసీలకు సీట్లు తగ్గనున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 60 జెడ్పీటీలు ఉండగా, 26బీసీలకు కేటాయించగా, 19 జనరల్‌కు కేటాయించారు. 556 ఎంపీటీసీలకు 240బీసీలకు, 184 జనరల్‌కు కేటాయించగా, పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే బీసీలల్లో 19శాతం సీట్లు తగ్గి, అంతే మొత్తంలో జనరల్ సీట్ల సంఖ్య పెరగనుంది. మొత్తంగా స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

బీసీల నోటికాడి ముద్ద లాక్కుంది



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ఆశచూపి ప్రభుత్వం మోసం చేసింది. రాజ్యాంగం నిర్దేశించిన విధానంలో కాకుండా సొంత ఎజెండా అమలు చేసేక్రమంలో బీసీ భావోద్వేగాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంది. 19 శాతం సీట్లలో పోటీకి అవకాశం ఇచ్చినట్టే ఇచ్చి.. నోటికాడ ముద్ద లాక్కుంది. అమలుకాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాలన్నింటికి బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– వీర్ల వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు

ఆశావహుల్లో తీవ్ర నిరాశ

స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్ వేసిన నేపథ్యంలో ప్రధాన పార్టీల కేడర్, ఆశావహుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. పంచాయతీ పాలకవర్గాలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం పూర్తయ్యి ఏడాదిన్నర కాలం గడిచింది. సుదీర్ఘ కాలంగా ఎన్నికలకు కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ జీవో విడుదల చేయడంతో బీసీవర్గాలకు దక్కే స్థానాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఎన్నికల నోటిఫికేషన్ సైతం విడుదల కావడంతో పెద్ద సంఖ్యలో ఆశావహులు ఎన్నికలకు సిద్ధమయ్యారు. తాజాగా ఎన్నికల నిర్వహణ నిలిచిపోనుండటం ఆశావహులు, ప్రధాన పార్టీల కేడర్‌లో నైరాశ్యాన్ని నింపింది. కోర్టు తీర్పు ప్రకారం కనీసం నెల రోజుల తర్వాతే ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా బీసీలకు రిజర్వేషన్లపై కోర్టులో తేలేవరకు వేచి చూస్తారా, లేక పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న దానిపైనే ఆసక్తి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న చర్చ గ్రామాల్లో కొనసాగుతోంది.

ఎంత పనాయే !

- ఎన్ని'కలలు' కల్లలాయే !
- దావతులు మీదపడే.. నామినేషన్ల ఊసు లేదాయే..
- 'స్థానికం' ఆశల్లో వదిలిన చేతిచమురు
- అంతర్మథనంలో ఆశావహులు



సిరిసిల్ల: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం.. రిజర్వేషన్ల ఖరారవడం.. ఎన్నికల తేదీ.. ఫలితాల ముహూర్తం సైతం ఫిక్స్ కావడంతో ఆశావహులు పోటీ చేసేందుకు ఆశపడ్డారు. ఇంతలోనే దసరా పండుగ రావడంతో గత పది రోజులు పల్లెల్లో దావత్‌లు జోరందుకున్నాయి. కులసంఘాలను, యువకులను కలుస్తూ మందు, విందులు ఏర్పాటు చేశారు. 'స్థానిక సంస్థల' ఎన్నికల్లో ఎంపీటీసీ సభ్యుడిగా, జెడ్పీటీసీ అభ్యర్థిగా, గ్రామసర్పంచ్‌గా, వార్డు సభ్యుడి పదవులపై ఆశలు పెట్టుకున్న వారు బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. అన్నీ సిద్ధం చేసుకున్న తరుణంలో ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ఆశావహుల ఆశలన్నీ ఆవిరయ్యాయి. వైకుంఠపాళీలో పెద్దపాము మింగినట్లు ఎన్ని'కలలు' కల్లలయ్యాయి. మళ్లీ ఆట మొదటికొచ్చినట్లయింది.

పన్నులు చెల్లించి రశీదులు పొందినా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి, నామినేషన్‌ను ప్రతిపాదించే వ్యక్తులను, బలపరిచే వారు ఎలాంటి పన్ను బకాయిలు ఉండొద్దు. బకాయిలుంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. ఈక్రమంలో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులే ముందు చూపుతో నామినేషన్‌పత్రంలో ప్రతిపాదించే వ్యక్తి, బలపరిచే వ్యక్తుల ఇంటి పన్నులు, నల్లా పన్నులను చెల్లించి రశీదులు పొందారు. అభ్యర్థులంతా ఒక్కొక్కరు మరో ఇద్దరి బకాయిలు క్లియర్ చేశారు. ఇంతలోనే ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడంతో అవాక్కయ్యారు. ఇప్పటికే చేసిన ఖర్చును తలచుకుని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. అన్నింటికీ మించి ఇంట్లో ఈ రాజకీయాలు వద్దు అని ముందు నుంచే చెబుతున్నా ఇంటి ఆవిడ ముందు(భార్య) ఎన్నికల దావత్‌ల ఖర్చుల లొల్లి తలనొప్పిగా మారింది.

దావత్‌లు దండగాయే..

ఇవన్నీ ఒక ఎత్తయితే.. గత పది రోజులుగా చేసిన దావత్‌ల ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఖరీదైన మందు, చికెన్, యాటపోతుల కూరలతో పోటాపోటీగా విందు రాజకీయాలు నడిపారు. దసరా పండుగ నేపథ్యంలో దూరపు ప్రాంతాల్లోని వారు సైతం సొంతూరికి రావడంతో వారికి ఓటుహక్కు ఉందని తెలిసి మందు, విందులతో ఆత్మీయతను చాటుకున్నారు. దసరా పండుగ జోరులో దావత్‌లు ఎక్కువయ్యాయి. పది రోజులు అన్ని ఊర్లలోనూ స్థానిక సంస్థల ఎన్నికల మందు, విందులకు ఆశావహుల చేతిచమురు భారీగానే వదిలింది. ఇంత చేసి నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకుని, ముహూర్తం కోసం చూస్తుండగా.. హైకోర్టు గురువారం ఎన్నికలపై స్టే విధించడంతో ఆశావహుల గుండెల్లో బండ పడినట్లు అయింది. ఇన్ని రోజులు ఇచ్చిన దావత్‌లన్నీ దండగాయే.. మళ్లా ఎన్నికల తరువాయి వచ్చేసరికి మళ్లీ ఖర్చులు తప్పవని బాధపడుతున్నారు. ఎంత పనాయే అంటూ.. లోలోపల మదనపడుతున్నారు.



గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టర్‌కు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డు

కరీంనగర్ అర్బన్: సమాచార హక్కు చట్టం అమల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రత్యేకత సంతరించుకుంది. స.హ చట్టం అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతి లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ కేటగిరీలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నీళ్ల పప్పు.. పల్చటి పాలు

- నాణ్యత లేని భోజనం.. రుచి లేని కూరలు
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆహార నాణ్యతపై కొరవడిన నిఘా



కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌టౌన్: నీళ్ల పప్పు, సాంబారు, పల్చటి పాలు.. మజ్జిగ కన్నా పల్చనైన పెరుగు.. మెనూలో కనిపించని గుడ్డు.. దొడ్డు బియ్యంతో అన్నం, నాణ్యత లేని కూరలు.. ఇదీ కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం . ఈ నాసిరకమైన భోజనాన్ని తినలేకపోతున్నామని రోగులు గగ్గోలు పెడుతున్నారు. రోజూ రోగులకు అందించే మెనూపై పర్యవేక్షణే కరువైందని, అసలు తమ గోడు పట్టించుకునే వారేలేరని రోగులు ఆరోపిస్తున్నారు. డైట్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. రోగులకు పోషకాహారం అందించాల్సిన కాంట్రాక్టర్లు నాసిరకం భోజనం పెడుతూ కాసులు వెనకేసుకుంటున్నారని చెప్పుకుంటున్నారు.

మెనూ లేదు... నాణ్యత లేదు

ప్రభుత్వ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరే రోగులకు చికిత్సతో పాటు ఆహారంలో నాణ్యత కరువైంది. నీళ్లలాంటి పప్పు, పలుచని పాలు, రుచిలేని కూరలు, దొడ్డు బియ్యం అన్నంతో రోగుల ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందడం లేదు. ప్రభుత్వం ఒక్కో పేషెంట్‌కు రూ.70తో పాటు హైప్రోటీన్ డైట్ (హెచ్‌పీడీ), డాక్టర్స్ డైట్‌కు రెట్టింపు ధరలు చెల్లిస్తోంది. అయినప్పటికీ మెనూ అమలులో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. గర్భిణులు, బాలింతలు, ఆపరేషన్లు అయిన పేషెంట్లకు హైప్రోటీన్ డైట్‌లో ప్రతీపూట రెండు కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉండగా ఒక్కటే ఇస్తున్నారు. అదికూడా ఒకవార్డులో ఇస్తే మరోవార్డులో ఇవ్వడం లేదని చెబుతున్నారు.

రుచి పచి లేని భోజనం

ప్రభుత్వ ఆస్పత్రిలో డైట్ క్యాంటీన్ నిర్వాహకులు ఇష్టానుసారం రుచిలేని భోజనం వడ్డిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి ఆవరణలో ప్రతి రోజు నిర్వహించే అన్నదానం భోజనం ఆస్పత్రిలోపల ఇచ్చే భోజనం కన్నా బాగొంటోందని రోగులు చెబుతున్నారు. ఆస్పత్రిలో నిఘా కరువవడంతో డైట్ కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకుండా, నాణ్యతను పక్కన పెట్టి లాభాల కోసం మాత్రమే పనిచేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీరుగారుతున్న లక్ష్యం

పేషెంట్లకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నప్పటికీ ఆ ఆహారంలో పోషకాలు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆరోగ్య శాఖకు చెడ్డ పేరు వస్తోంది. ఆసుపత్రిలో, క్యాంటీన్లో మెనూ ఏం పెడుతున్నారనే ప్రదర్శన ఎక్కడా కనిపించదు. రోజువారీ నాణ్యత తనిఖీలు, ఫిర్యాదు నంబర్లు ఏర్పాటు చేయాలని ఆస్పత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లకు ఇచ్చే భోజనం క్వాలిటీగా ఉండేలా చర్యలు చేపడతాం. గతంలోనే ఈ విషయాన్ని డైట్ కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి క్వాలిటీ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లి మంచి భోజనం అందేలా చూస్తాం. నిబంధనల ప్రకారం క్వాలిటీ లేకుంటే శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్లే

- బీజేపీ శ్రేణులతో కేంద్రమంత్రి బండి సంజయ్ టెలీ కాన్ఫరెన్స్



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు మొదలు రాష్ట్రస్థాయి నాయకుడి వరకు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. ఆయా నేతలు నివసించే గ్రామాలు, మండలాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తేనే పేరు ప్రఖ్యాతలు ఉంటాయని స్పష్టం చేశారు. తనను ఎంపీగా గెలిపించింది కార్యకర్తలేనని, స్థానిక సంస్థల్లో వాళ్లను గెలిపించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని అన్నారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల ఇన్‌చార్జిలు గంగిడి మనోహర్‌రెడ్డి, శాంతికుమార్, ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు హైకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సర్వేలన్నీ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. బీజేపీ అభ్యర్థికోసం కాకుండా ఇతరుల గెలుపుకోసం పనిచేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్లేనని గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు.

పారదర్శక పాలనే లక్ష్యం

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: ప్రభుత్వశాఖల్లో పారదర్శక పాలన అందించేందుకే సమాచార హక్కు చట్టం రూపొందించారని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అన్నారు. సమాచార హక్కు చట్టం– 2005 అమల్లోకి వచ్చి 20ఏళ్లు అవుతున్న నేపథ్యంలో ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత పెరిగిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరే సమాచారాన్ని అందించడంలో పీఐవో, ఏపీవోల బాధ్యత కలిగి ఉంటారని, వారు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమాచార హక్కు చట్టం–2005లోని అంశాలు, ఆర్టీఐ దరఖాస్తు విధానం, దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తు ఫీజు, దరఖాస్తుదారుకు ఇవ్వాల్సిన సమాచారం, పీఐవో, ఏపీఐవోల బాధ్యతలు, తదితర అంశాలపై సమాచార హక్కు చట్టం రిసోర్స్ పర్సన్ జి.కిషన్ అధికారులు, పీఐవో, ఏపీఐవోలకు క్షుణ్ణంగా వివరించారు. సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాశ్, ఏవో గడ్డం సుధాకర్, కరీంనగర్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు, ఈడీఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీవోలు, ఆర్పీలు లక్ష్యాలను చేరుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: తమకు విధించిన లక్ష్యాలను సీవోలు, ఆర్పీలు చేరుకోవాలని మెప్మా పీడీ స్వరూపరాణి అన్నారు. గురువారం మెప్మా కార్యాలయంలో నగరపాలకసంస్థ పరిధిలోని సీవోలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్పీలు, సీవోలు తమ పరిధిలో కొత్త సంఘాల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీల టార్గెట్లను రీచ్ కావాలన్నారు. స్వయం ఉపాధి పథకం కింద సంఘం సభ్యుల కుటుంబాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. వీధి వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం లోక్‌కల్యాణ్ పథకాన్ని ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినందున, లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. వీధి వ్యాపారుల కోసం బ్యాంక్ ద్వారా మొదటి విడతలో రూ.15 వేలు, రెండవ దఫా రూ.25 వేలు, మూడవ దఫా రూ.50 వేలు మంజూరు అవుతాయన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ మానస పాల్గొన్నారు.

రేపటి నుంచి ముంబై- కరీంనగర్ ప్రత్యేక రైలు

కరీంనగర్‌రూరల్: ముంబై నుంచి కరీంనగర్‌కు ప్రత్యేకంగా మరో రైలును ఈ నెల 11నుంచి ప్రారంభించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే గతనెల 24నుంచి ముంబై ఎల్‌టీటీ నుంచి కరీంనగర్‌కు రైలును నడిపిస్తున్నారు. ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.30గంటలకు లోకమాన్య తిలక్ టర్మినస్ నుంచి రైలు బయల్దేరి బుధవారం ఉదయం 11గంటలకు కరీంనగర్ చేరుకుంటుంది. దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి ముంబై–కరీంనగర్ మధ్య మరో ఏసీ రైలును నడిపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 11 నుంచి నవంబరు 15 వరకు ప్రతి శనివారం రైలు నడుస్తుంది. ముంబైలోని ఛత్రపతిశివాజీ మహరాజ్ టర్మినస్ స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత 12.20గంటలకు బయల్దేరి శనివారం సాయంత్రం 4గంటలకు కరీంనగర్ చేరుకుంటుంది. అదే రోజు సాయంత్రం 5.30గంటలకు కరీంనగర్ నుంచి బయల్దేరి ఆదివారం మధ్యాహ్నం 1.50గంటలకు ముంబై చేరుతుంది. మెట్‌పల్లి, కోరుట్లలో హాల్టింగ్ ఉంది.

క్లుప్తంగా

సోలార్ ప్లాంట్ నిర్మాణంలో వలస కార్మికుడి మృతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్ నిర్మాణ పని ప్రదేశంలో జరిగిన ప్రమాదంలో ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివదయాల్ రావత్(23) మా అష్టభుజ కన్‌స్ట్రక్షన్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం విధులు నిర్వహిస్తున్న క్రమంలో అతడిపై ట్రాన్స్‌ఫార్మర్ పడింది. తీవ్రగాయాలైన అతడిని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

పని స్థలాల్లో రక్షణ చర్యలు కరువు

సోలార్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రక్షణ లేక ప్రమాదం జరిగి వలస కార్మికుడు మృతి చెందడం బాధాకరమని పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ ఆరోపించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో కౌలురైతు..

వెల్గటూర్ (ధర్మపురి): విద్యుత్ షాక్‌తో కౌలురైతు మృతిచెందిన ఘటన ఎండపల్లి మండలం మారేడ్‌పల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బింగి సతీశ్ (35) భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. గురువారం ఉదయం తన తండ్రితో కలిసి పత్తి చేనుకు మందు కొట్టేందుకు వెళ్లాడు. నీళ్ల పోసేందుకు బిందె కోసమని తండ్రిని పక్క పొలానికి వెళ్లమని చెప్పాడు. ఈక్రమంలో అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు పక్క పొలానికి చెందిన కోట కనకయ్య పొలానికి విద్యుత్ తీగలు అమర్చాడు. ఉదయం పూట విద్యుత్ కనెక్షన్ తొలగించాల్సి ఉండగా అతడు పొలానికి రావడం ఆలస్యం అయింది. అప్పటికే పత్తి మందు కొట్టేందుకు వచ్చిన సతీశ్ విద్యుత్ తీగలు గమనించకుండా వాటిపై కాలు వేయడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఏడేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. కాగా ముంజంపల్లి, మారేడ్‌పల్లి గ్రామాల్లో విద్యుత్‌షాక్‌తో రెండునెలల్లో ముగ్గురు మృతిచెందారు. ముంజంపల్లికి చెందిన బొమ్మగాని తిరుపతి ట్రిమ్మర్ చార్జింగ్ పెడుతూ, మారేడ్‌పల్లికి చెందిన లింగాల చిన్నయ్య, బింగి సతీశ్ పొలం వద్ద మృతిచెందారు.

దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో..


శ్రీకాంత్ (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌కు చెందిన దోమకొండ శ్రీకాంత్‌యాదవ్(26) అనే యువకుడు గల్ఫ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈమేరకు గురువారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శ్రీకాంత్ ఆరు నెలల క్రితం స్వగ్రామంలో ఉపాధి లేక దుబాయ్ వెళ్లాడు. ఈనెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి తండ్రి దేవయ్య, తల్లి చంద్రవ్వ ఉన్నారు. శ్రీకాంత్ మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సీఆర్పీఎఫ్ జవాన్ బలవన్మరణం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ బుధవారం సాయంత్రం బలవన్మరణానికి పాల్పడగా గురువారం వేకువజామున వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల వివరాల ప్రకారం. పెరుమాండ్ల రాజ్‌కుమార్(38) జార్ఖండ్‌లో సీఆర్పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దసరా పండక్కి ఇంటికి వచ్చి, నిరాశగా ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమయంలో ఆయన భార్య, కూతురు పుట్టింటికి వెళ్లినట్లు సమాచారం. జవాన్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. తన చావుకు ఎవరూ కారణం కాదని, తనకు నిద్ర పట్టడం లేదని, అక్క, బావలు అమ్మానాన్నలను మంచిగా చూసుకోవాలని లేఖలో రాశాడు. మృతుడి తండ్రి బిక్షపతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన పోతు అంజయ్య(76) అనే వృద్ధుడు అనారోగ్యం బాధ భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. అంజయ్య కొంతకాలంగా మూత్ర, మలవిసర్జన వ్యాధులతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో చూపించగా నయం కాలేదు. బీపీ, షుగర్ పెరగడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. గతంలోనే అతని భార్య అనారోగ్యంతో చనిపోవడం, వృద్ధాప్యంలో తనకు సేవలు చేసే వారు లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. మృతునికి ముగ్గురు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు ఆనందం గతంలో అనారోగ్యంతో మరణించాడు. మిగతా ఇద్దరు కుమారులు అమెరికాలో ఉంటున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు.

WANTED
తెలుగు, హిందీ ప్రచారకులు కావలెను
మా సంస్థ నిర్వహించే తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షలకు
ఈమ పాఠశాలలతోపాటు మరో ఐదు పాఠశాల
విద్యార్థులతో రాయించే తెలుగు, హిందీ ఉపాధ్యాయులు
కావలెను. ప్రచారకులకు 5 వేలు.
మన సంస్కృతి
73966 49947, 98663 67419

‘ఉపాధి’ కూలీలకు భరోసా ఎప్పుడో?

- అందని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- ఎదురుచూపులే దిక్కు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పల్లి లక్ష్మి. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట. గుంట కూడా వ్యవసాయ భూమిలేని ఈమె ఉపాధిహామీ పనులకు వెళ్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లక్ష్మిని ఎంపిక చేశారు. ఏడాదికి రూ.12వేలు వస్తాయని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి రాలేదు. ఇలాంటివారు జిల్లా వ్యాప్తంగా 11,267 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూస్తున్నారు.

కోనరావుపేట(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా భూమిలేని ఉపాధిహామీ కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందిస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు కూలీలకు అందించలేదు. దీంతో జిల్లాలో ఉపాధిహామీ కూలీలు ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూస్తున్నారు.

పథకానికి అర్హులు వీరే..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ప్రభుత్వం కొన్ని నిబంధనలు జారీ చేసింది. లబ్ధిదారు ఉపాధి కూలీ అయి ఉండాలి. భూమిలేని వారు ఉండాలి. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధిహామీ పని చేసి ఉండాలి.


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో 11,267 మంది లబ్ధిదారులు

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా జిల్లాలోని 255 గ్రామాల్లో 11,267 మందిని గుర్తించారు. మొదట జిల్లాలోని 12 మండలాల్లో మండలానికి ఒక గ్రామం చొప్పున పైలట్ ప్రాజెక్ట్ కింద గుర్తించి 368 మందిని ఈ యేడాది జనవరి 26న ఎంపిక చేశారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు డబ్బులు రాలేదు.

లబ్ధిదారుల వివరాలు

మండలం	గ్రామాలు	లబ్ధిదారులు
బోయినపల్లి	23	851
చందుర్తి	19	658
ఇల్లంతకుంట	33	1,136
గంభీరావుపేట	21	1,235
కోనరావుపేట	28	1,132
ముస్తాబాద్	22	1,083
రుద్రంగి	10	284
తంగళ్లపల్లి	30	1,660
వీర్నపల్లి	17	729
వేములవాడ అర్బన్	11	292
వేములవాడ రూరల్	17	682
ఎల్లారెడ్డిపేట	24	1,525
మొత్తం	255	11,267

భరోసా కోసం ఎదురుచూస్తున్నాం



ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఎంపికయ్యాను. ఎలాంటి వ్యవసాయ భూమి లేని మాకు ఏడాదికి రూ.12వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలి.

– తంగళ్లపెల్లి లింగయ్య, ధర్మారం

జాబితా పంపినం



ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం గ్రామాల వారీగా అర్హులైన ఉపాధిహామీ కూలీల వివరాలు సిద్ధం చేశాం. ఉన్నతాధికారులకు పంపించాం. ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కూలీలకు అందిస్తాం.

– శ్రీనివాస్, ఏపీవో, కోనరావుపేట

దుండగులా..? తెలిసినవారా..?

- విష ప్రయోగంతోనే వృద్ధుడు మృతి?
- ఇంకా ఆస్పత్రిలోనే వృద్ధురాలు
- వీడని గర్శకుర్తి దంపతుల మిస్టరీ
- అన్ని కోణాల్లో విచారిస్తున్న పోలీసులు


వంటగదిలో పడిపోయిన లక్ష్మి


ఆరుబయట శంకరయ్య

గంగాధర: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో చోటు చేసుకున్న వృద్ధదంపతులు స్పృహకోల్పోయిన ఘటనలో విషప్రయోగం జరిగిందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో భర్త చనిపోగా.. భార్య ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తుండగా.. గురువారం వరకు కూడా ఇంకా కొలిక్కి రానట్లు సమాచారం. గర్శకుర్తికి చెందిన గజ్జెల శంకరయ్య, లక్ష్మి దంపతులు బీసీ కాలనీ సమీపంలో ఇంట్లో ఇద్దరే ఉంటారు. మంగళవారం ఉదయం మార్కెట్‌కు వెళ్లిన శంకరయ్య బోటి తీసుకొచ్చాడు. సాయంత్రమైనా దంపతులు ఇంటిబయటికి రాకపోవడంతో సమీప కుటుంబాలవారు వెళ్లి చూడగా.. బోటి శుభ్రం చేసే చోట శంకరయ్య, వంటగదిలో లక్ష్మి స్పృహ తప్పి పడిపోయి ఉన్నారు. గ్రామస్తులు అంబులెన్సులో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శంకరయ్య చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. అయితే దంపతులపై విషప్రయోగం చేసి లక్ష్మి మెడలోని పుస్తెల తాడు, బీరువాలోని మరో బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ పని తెలిసిన వారు చేశారా..? గుర్తు తెలియనివారు చేశారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను వేగంగా ఢీకొట్టిన కారు
- ఫ్లైఓవర్ పైనుంచి కిందపడిన యువకుడు
- అక్కడికక్కడే మృతి.. నిజాయితీగూడెంలో విషాదం


శ్రీనివాస్(ఫైల్)

మానకొండూర్: కారురూపంలో మృత్యువు వేగంగా దూసుకొచ్చింది. ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న యువకుడు ఎగిరి ఫ్లైఓవర్ పైనుంచి కిందపడి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద గురువారం చోటు చేసుకుంది. మానకొండూర్ మండలం నిజాయితీగూడెం గ్రామానికి చెందిన చామంతుల శ్రీనివాస్(27) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పని నిమిత్తం బైక్‌పై కరీంనగర్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా చెంజర్ల వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కరీంనగర్ వైపు వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. శ్రీనివాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ బి.సంజీవ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లి సంవత్సరికం రోజే తనయుడి మృతి

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బొలెరో
- మంథని–కాటారం రహదారిపై గ్రామస్తుల ఆందోళన


సమ్మయ్య మృతదేహం

మంథనిరూరల్: ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది.. తల్లి మరణించి ఏడాది గడిచి మాసికం చేసుకున్న రోజునే మరొకరి మరణవార్త వినాల్సి వచ్చింది. కన్నతల్లి ఏడాది మాసికం రోజు తనయుడు మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగెపల్లిలో చోటు చేసుకుంది. మంథని మండలం నాగేపల్లి గ్రామ శివారులోని మంథని–కాటారం ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనాన్ని బొల్లోరా వాహనం ఢీకొట్టిన సంఘటనలో నాగెపల్లికి చెందిన ముక్కెర సమ్మయ్య(30) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది సమ్మయ్య తల్లి మృతి చెందగా గురువారం ఏడాది మాసిక కార్యక్రమం చేశాడు. అయితే సమీపంలోని అడవిసోమన్‌పల్లి గ్రామంలో తన చిన్నమ్మ ఉండగా ఆమెను తీసుకురావడానికి తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నాగెపల్లి దాటిన తర్వాత లారీని ఓవర్ టేక్ చేస్తూ వచ్చిన బొల్లొరా వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సమ్మయ్య అక్కడికకక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు మంథని–కాటారం ప్రధాన రహదారిపై మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న మంథని ఎస్సై రమేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లోన్ చెల్లించినా వేధింపులు

సైదాపూర్: తీసుకున్న హోంలోన్ చెల్లించినా సదరు సంస్థ సిబ్బంది వేధింపులకు గురిచేయడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. బాధితుడి భార్య లక్ష్మి వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం గొడిశాలకు చెందిన గిన్నారపు దుర్గయ్య(47) ఆటో డ్రైవర్. హుస్నాబాద్‌లోని మహీంద్ర హోం ఫైనాన్స్‌లో ఇల్లు తాకట్టు పెట్టి రూ.1,20,000 అప్పు తీసుకున్నాడు. నెలనెలా రికవరీ ఉద్యోగి గుళ్ల భాస్కర్‌కు కిస్తీలు చెల్లించాడు. అయినా బాకీ చెల్లించడం లేదని నలుగురు వ్యక్తులు దుర్గయ్య ఇంటికి వచ్చి దుర్భషలాడారు. భాస్కర్ కిస్తీలను తమ సంస్థకు చెల్లించలేదని వేధించారు. మనస్తాపం చెందిన దుర్గయ్య పురుగులమందు తాగాడు. హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు.

అవయవదానాలపై అసెంబ్లీలో చర్చిస్తా


దాతల కుటుంబాలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ(రామగుండం): అవయవదానాలపై రాబోయే అసెంబ్లీలో నేనే స్వయంగా చర్చిస్తానని, పలు రాష్ట్రాలకు ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకునేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గోదావరిఖనిలోని సిమ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గురువారం నిర్వహించిన సదాశయ ఫౌండేషన్ 17వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవయవ దాతల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు డాక్టర్ అరుణ, డాక్టర్ శశికాంత్ కిరాగి, డాక్టర్ రణధీర్‌తో పాటు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పి.శ్యాంసుందర్, ఎల్వీపీ బ్యాంక్ మేనేజర్ కిషన్ రెడ్డి, వాసన్ ఐ బ్యాంక్ మేనేజర్ అరవింద్ కుమార్, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధుల తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌కు దీపావళి స్పెషల్ రైలు

రామగుండం: దీపావళి పండుగ పురస్కరించుకొని సికింద్రాబాద్–ఉద్నా జంక్షన్ (గుజరాత్ రాష్ట్రం)కు స్పెషల్ రైలు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. గురువారం ప్రత్యేక రైలు ప్రయాణ సమయం, హాల్టింగ్స్ వివరాలను వెల్లడించారు. ప్రతీ ఆదివారం రాత్రి గం.9.40లకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి గం.7 గంటలకు ఉద్నా జంక్షన్ (గుజరాత్) చేరుకుంటుందన్నారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన ప్రత్యేక రైలుకు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు పేర్కొన్నారు.

పెద్దపులి సంచారం వదంతులు నమ్మొద్దు


బుగ్గ అటవీప్రాంతంలో పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని బుగ్గ అటవీప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దని ఈసాలతక్కళ్లపల్లి సెక్షన్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్ తెలిపారు. ఏఐ టెక్నాలజీతో కొంతమంది ఆకతాయిలు బుగ్గ రోడ్డుపై పెద్దపులి సంచరిస్తున్నట్లు రెండురోజులుగా సోషల్ మీడియాలో ఫొటో వైరల్ కావడంతో పాటు కొన్ని పత్రికల్లో సైతం వార్తలు వస్తున్న నేపథ్యంలో స్పందించిన ఫారెస్టు అధికారులు బుగ్గ అటవీప్రాంతంలో క్షేత్రస్థాయిలో గురువారం పర్యటించారు. రామగుండం డీఆర్‌వో కొమురయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పెద్దపల్లి సతీశ్‌కుమార్, బీట్ ఆఫీసర్ మేఘరాజ్, ఫారెస్టు సెక్షన్ అధికారి రహమతుల్లాతో కలిసి పరిశీలించారు. పులి సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో పులి సంచారం పుకారుగా నిర్ధారించిన అధికారులు ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. అదేవిధంగా సోషల్‌మీడియాలో వదంతులు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బసంత్‌నగర్, అంతర్గాం ఎస్సైలను కోరినట్లు దేవదాసు తెలిపారు.

ఆలయాల్లో దొంగతనం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కనుకుల పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దొంగలు పడి పుస్తెలు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు ముదిరాజ్ కులస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ఆలయం తలుపులు తీసి చూసేసరికి అమ్మవారి మెడలోని బంగారు పుస్తెలు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు తెలిసిందన్నారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ పరిశీలించి క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. ముదిరాజ్‌కుల సంఘం అధ్యక్షుడు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్ శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో..


సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఎత్తుకెళ్లిన హుండీ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు ఆలయ హుండీని ఎత్తుకెళ్లి పోలీస్‌స్టేషన్ దారిలోని నీకంఠం చెరువు వద్ద పగులగొట్టారు. అందులోని కానుకలు, నగదు దోచుకున్నారు. సమీప ప్రజలు పోలీసులకు సమాచారం అందించగా ఆలయాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం: క్రెడిట్‌కార్డ్ యాక్టివేషన్ పేరుతో వాట్సాప్‌లో ఏపీకే లింక్స్ పంపి ప్రజలను మోసం చేసిన అంతర్‌రాష్ట్ర సైబర్ నేరస్తుడిని సిరిసిల్ల పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అంకిత్‌కుమార్(జార్ఖండ్) కాగా.. మరో ఇద్దరు మహమ్మద్ ఖలీంపాషా (హైదరాబాద్), రషీద్ పరారీలో ఉన్నారు. నిందితులు బ్యాంకుల పేరుతో పలువురికి ఫోన్‌చేసి క్రెడిట్‌కార్డు యాక్టివేషన్ కోసం ఏపీకే లింక్స్ పంపి వారి ఫోన్లు హ్యాక్ చేసి, క్రెడిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్ల పేరుతో డబ్బులు కాజేశారు. దేశవ్యాప్తంగా వీరిపై ఎన్సీఆర్పీ పోర్టల్‌లో 327 ఫిర్యాదులు నమోదయ్యాయి. సిరిసిల్ల సైబర్ టీమ్ ఆర్‌ఎస్సై జునైద్, గంగారెడ్డి, కిట్టు, మహేశ్ ఆధ్వర్యంలో జార్ఖండ్‌లో అరెస్ట్ చేశారు. వీరిని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

ఆన్‌లైన్ పెట్టుబడిదారులు..

జగిత్యాలక్రైం/కొడిమ్యాల: ఆన్‌లైన్ మెటాఫండ్‌లో పెట్టుబడులు పెట్టించి మోసానికి పాల్పడిన ఇద్దరిని గురువారం రాత్రి జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీసులు అరెస్ట్ చేసినట్లు విశ్వాసనీయవర్గాల సమాచారం. తిరుపతిరెడ్డి, రాజు మెటాఫండ్ అనే ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని ఆశ చూపి చాలా మంది నుంచి పెట్టుబడి పెట్టించి మోసానికి పాల్పడడంతో పాటు, ఆన్‌లైన్ యాప్ కూడా ఆరునెలల క్రితం నిలిచిపోవడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో తమ డబ్బు చెల్లించాలని నిందితులను బాధితులు కోరగా చాలా రోజులుగా మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీశారు. విసుగుచెందిన బాధితులు కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసి గురువారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. కాగా, ఈ విషయంపై కొడిమ్యాల ఎస్సైని వివరణ కోరగా, తన వద్ద ఎలాంటి సమాచారం లేదని, సమయం పడుతుందని దాటవేశారు. అలాగే జగిత్యాలకు చెందిన ఒకరితో పాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని లోతైన విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

గంజాయి విక్రేతలు..

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకవాడలో గంజాయి విక్రయిస్తున్న షేక్ సాహిద్, దేశవేని మహేశ్‌ను పట్టుకుని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సుప్రియ తెలిపారు. గురువారం చిలుకవాడలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా పట్టణంలోని ఖాజామహెళ ప్రాంతానికి చెందిన షేక్ సాహిద్, జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంకు చెందిన దేశవేని మహేశ్ అనుమానాస్పదంగా కన్పించారు. వారిని తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై రవికిరణ్ తెలిపారు.

హత్య కేసులో అన్నదమ్ములకు యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: మంత్రాల నెపంతో ఒకరిని హత్య చేసిన అన్నదమ్ములకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి సుగళి నారా యణ గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశంగౌడ్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన సూర దుర్గయ్య రాళ్లు కొట్టుకుంటూ జీవిస్తాడు. అవసరం నిమిత్తం అదే గ్రామంలోని టేల మల్లేశ్ వద్దకు వెళ్లి డబ్బులు అడుగగా, తన దగ్గర లేవని చెబుతాడు. ఈ నేపథ్యంలోనే అదే గ్రా మానికి చెందిన అన్నదమ్ములు దారంగుల రాజేశం, దారంగుల రాజు ఓ చోట మద్యం సేవిస్తుండగా, దుర్గయ్య కూడా మద్యం తాగేందుకు అక్కడ ఆగుతాడు. కాగా ఇద్దరు అన్నదమ్ములకు, దుర్గయ్యకు గతంలో పాతపగలతో పాటు తమకు మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఉంది. ఈక్రమంలో పథకం ప్రకారం మద్యం తాగుదామని దుర్గయ్యను అన్నదమ్ములు బుగ్గారం మండలం మద్దునూర్ గు ట్టల ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేస్తారు. ఈ ఘట నపై మృతుడి కొడుకు శేఖర్ ఫిర్యాదు మేరకు బుగ్గా రం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ధర్మపురి సీఐలు కె.రాంచందర్ రావు, బి.కోటేశ్వర్ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులైన అన్నదమ్ములు రాజేశం, రాజును అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, బి.రాజునాయక్, వి.శ్రీధర్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టగా, జడ్జి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితులను యావజ్జీవశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మహిళా సాధికారికత.. ఆరోగ్య సంరక్షణ


మల్యాలలో బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు

మల్యాల: మహిళలు స్వయం ఉపాధి పొందుతూ..ఆర్థికంగా నిలదొక్కుకుంటే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుంది. తద్వారా మహిళా సాధికారికతకు బాటలు పడుతాయనే సంకల్పంతో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అందజేసి మహిళా సాధికారిత దిశగా అడుగులు వేసేందుకు బీఎస్ రావు ఫౌండేషన్ తోడ్పాటునందిస్తోంది. విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమనే సంకల్పంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలకు వందలాది పుస్తకాలు అందజేశారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన సామాజిక వేత్త, వైద్యుడు బీఎస్ రావు వ్యవస్థాపక చైర్మన్‌గా 2017లో బీఎస్ రావు ఫౌండేషన్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, ఆరోగ్య సంరక్షణపై ప్రజలను చైతన్యపరుస్తు, ఇటు వైద్యపరంగా అవగాహన పెంపొందిస్తూ, అటు మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ, ఆరోగ్య సమాజం కోసం తనవంతు సేవలందిస్తున్నారు. బీఎస్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నిరుపేద మహిళలను గుర్తిస్తూ, స్వయం ఉపాధి కల్పించి, మహిళా సాధికారికత కోసం ఉచితంగా కుట్టుమిషన్ల శిక్షణ అందిస్తున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్, మల్యాలలో కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించారు. వేములవాడ, గంగాధరలో సైతం ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మల్యాలలో న్యాక్ సౌజన్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కుట్టుమిషన్‌తో స్వయం ఉపాధి



కుట్టుమిషన్ శిక్షణతో స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ తీసుకుంటున్న. మహిళలకు ఆర్థికంగా ఆదాయం ఉంటే, కుటుంబం సాఫీగా సాగుతుంది. ఉచితంగా శిక్షణ అందజేస్తున్న డాక్టర్ బీ.ఎస్.రావు ఫౌండేషన్‌కు రుణపడి ఉంటాం. నేను నేర్చుకున్న విద్యను మరింతమందికి అందజేస్తాను. మహిళలు రోజంతా ఎండలో కష్టపడినా కూలీ గిట్టుబాటు కావడం లేదు. కుట్టు మిషన్‌తో ఇంటివద్దే స్వయం ఉపాధి పొందుతూ, కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటాం.

– కవిత, మల్యాల

కుటుంబానికి దిక్సూచి మహిళ



ప్రతి ఇంట్లో మహిళలతోనే కుటుంబం అభివృద్ధి చెందుతుంది. కుట్టు మిషన్ శిక్షణతో ఇంటి వద్దే ఉపాధి పొందే మార్గం లభిస్తుంది. కుటుంబ సభ్యుల దుస్తులు కుట్టడంతోపాటు, స్వయం ఉపాధి లభిస్తుంది. మహిళలు వంటింటికే పరిమితం చేయకుండ మహిళలకు అవకాశం ఇస్తే, అన్నిరంగాల్లో ఆకాశమే హద్దుగా రాణిస్తాం. మహిళలు కుటుంబానికి దిక్సూచీ. మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబం, తద్వారా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయి.

– మౌనిక, మల్యాల

వైద్య భరోసా కల్పించేందుకు..



ప్రతి కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉండడంతో పాటు, ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో బీఎస్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ప్రజలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. కుట్టుమిషన్ ఉచిత శిక్షణ ద్వారా మహిళలు ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంది. తద్వారా మహిళా సాధికారికత సాధించేందుకు కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్ల, మల్యాలలో ఉచిత శిక్షణ ప్రారంభించినం.

– బీఎస్ రావు, ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్

సాక్షి
ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 10-10-2025


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం

ముందే పాఠం నేర్పుకుందాం

ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్లరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పదమూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమికా

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో! 24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లలో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితో పాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతో పాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టులూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనుష్కా శర్మ, విరాట్ కోహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదూ చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా పాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.



కేర్‌గివర్

రాణి అనే నేను ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...

ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సెర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

జర్నీ

భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80-డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతో పాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.







ఫ్యాషన్

● ఇయర్ చెయిన్స్


మెరిసే సరాలు



రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు
లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు
మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న
ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్
సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం
నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా
నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో
తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా
ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్,
ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.













సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ అద్దుకున్న ఆధునికత

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ శక్తి సరాలు..

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు–జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.

■ సెలబ్రిటీల స్టైల్ టచ్

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వీకపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.



మనసు మాట విందాం!

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ–పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?

ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	1,26,250	1,24,150	1,26,250.	1,28,000	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	1,13,380	1,13,800	1,17,210	1,17,700	1,14,000
వెండి	1,70,000	1,58,600	1,67,000	1,58,600	1,60,000	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.